క్లుప్తంగా

ధర్మ శంఖారావానికి తరలి వెళ్లిన వీహెచ్‌పీ నేతలు



నరసరావుపేట ఈస్ట్: హిందూ ధర్మ దీక్షా సేవక్ ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం నిర్వహించిన హైందవ ధర్మ శంఖారావంలో పాల్గొనేందుకు పట్టణం నుంచి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 58 మంది సభ్యులు వెళ్లారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మహిళా ప్రముఖ్ జొన్నలగడ్డ రాజరాజేశ్వరి, పట్టణ అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణ, శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం వాసవీ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనుమాలశెట్టి రామలింగేశ్వరరావు, చెంచు రామారావు సహకారంతో ధూళిపాళ్లలోని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేష్ సిబ్బందితో శిబిరంలో సేవలందించారు. నరసరావుపేట పరిసర గ్రామాల నుంచి వంద మంది దాకా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మిట్టపల్లి చంద్రమోహన్ కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాడువాయి శ్రీనివాసరావు, కార్యదర్శి కొత్తూరి ప్రసాదరావు, శ్రీ వాసవీ మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మదరస్సాకు ఆర్థిక సాయం



చిలకలూరిపేట టౌన్: జ్ఞానేశ్వర ఫౌండేషన్ ద్వారా పేదలకు షేక్ జాన్‌సైదా ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని వేలూరు గ్రామ ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. గత నెలలో రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి ముస్లింకు తోఫా ఉచితంగా అందజేశారని కొనియాడారు. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇస్లాహున్నిసా మదరసాకు జాన్‌సైదా రూ. 50వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, గ్రామ ముస్లిం మత పెద్దలు పఠాన్ అల్లాబక్షు, ఖాదర్ వలి, ఖాసీంపీరా, సుభాని, బాజీ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

బొల్లాపల్లి: కాయల కోసం తాటి చెట్టు ఎక్కి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దోమలగుండంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పోలేపల్లి ఏసుబాబు (24) సమీపంలోని పొలాల్లో తాటికాయల కోసం చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తొలుత ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఏసుబాబు మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణ పరిరక్షణ



సత్తెనపల్లి: 'మేరీ లైఫ్, మేరీ స్వచ్ఛ షహర్' ప్రచారంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్) కేంద్రాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ కోరారు. పట్టణంలోని 27వ వార్డులో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత దుస్తులు, చెప్పులు, గాజు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగం కోసం కొత్త ఉత్పత్తులుగా చేయడానికి ఉపయోగిస్తారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వ్యర్థాల్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్, ఈ–వేస్ట్ వల్ల హానికరమైన కెమికల్స్ ఉత్పత్తి పర్యావరణానికి హాని కలుగజేస్తున్నాయని తెలిపారు. ప్రజలంతా మున్సిపల్ కార్మికులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, శానిటరీ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భూరక్ష పథకంతో అక్రమాలకు అడ్డుకట్ట

- 90లక్షల మంది రైతులకు మేలు
- పట్టణాల్లో 40లక్షల స్థిరాస్తుల సర్వే
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని



డ్రోన్ ముందు పథకం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి జగనన్న తీసుకొచ్చిన వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంతో భూ సంబంధ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలు ఏర్పడిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో మీభూమి– మా హామీ కింద చేపడుతున్న భూసర్వే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా పాల్గొని డ్రోన్‌ను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ భూ రక్ష పథకం ద్వారా ఏకంగా రాష్ట్ర వ్యాప్తంగా 90లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. గట్టు తగాదాలు ఇక ఉండవన్నారు. భూ వివాదాలకు ఇది శాశ్వత పరిష్కారం అని తెలిపారు. బలవంతులు ఎవరి భూమినైనా అక్రమిస్తే.. ప్రభుత్వమే దాన్ని విడిపించి బాధితులకు అందజేసే గొప్ప కార్యక్రమం ఇది అని వివరించారు. 22.6 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి, గ్రామాల్లో 85లక్షల ఆస్తులు, పట్టణాల్లో 40లక్షల స్థిరాస్తులు, 10లక్షల లేఅవుట్లలో ప్లాట్లకు ఈ సర్వే జరుగుతుందని వెల్లడించారు. వందేళ్ల తర్వాత తొలిసారి జగనన్న ఈ మహాయజ్ఞాన్ని చేపట్టారని తెలిపారు. స్థిరాస్తుల రీసర్వేతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. సర్వే పూర్తయితే ఇక భూ రికార్డులన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. శాశ్వత భూహక్కు పత్రాన్ని కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంతోషం, పండగ పాలన

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పండగ లాంటి పాలన కొనసాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని బొప్పూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని ఇంటింటికీ వెళ్లారు. ఏ పథకం ద్వారా ఎంత మేలు జరిగిందో వివరించారు. ఆమె మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామని చెప్పారు. రూ. 16వేల కోట్లతో గ్రామస్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా సాంబయ్య, గుత్తా యాములయ్య, అమీర్‌జాని, అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణలో మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఆంధ్ర భోజుడుగా కీర్తి ప్రతిష్టలు పొందిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని కొనియాడారు. పట్టణంలోని భాస్కర్ సెంటర్‌లోని రోడ్డు డివైడర్‌పై శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరుకున్నట్లు చరిత్ర చెబుతుందన్నారు. తెలుగు, కన్నడ ప్రజలతో పాటు భారత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ఒకరని తెలిపారు. ఆయన విగ్రహ ఏర్పాటు ద్వారా భావితరాలకు ఆయన ఆదర్శాల్ని చేరవేసే అవకాశం కలుగుతుందని వివరించారు. విగ్రహ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, విగ్రహ కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట రామచంద్రప్రసాద్, అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, పొన్నం చంద్రశేఖర్, మిరియాల లక్ష్మీనారాయణ, గాలి బుచ్చయ్య, ఇక్కుర్తి పవన్‌కుమార్, వట్టెం శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ



కార్యాలయంలో రౌడీషీటర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

నరసరావుపేట: రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలని, ప్రజాశాంతికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై పోలీసుల నిఘా నిరంతరమూ ఉంటుందని, సత్ప్రవర్తనతో మెలుగుతూ తీరు మార్చుకొని పోలీసులకు ఇన్ఫార్మర్లుగా వ్యవహరించాలని సూచించారు. గత అనుభవాల్ని మరిచి మళ్లీ తప్పులు చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని, మంచి నడవడికతో మసులుకుంటే రౌడీషీట్ ఎత్తివేస్తామని చెప్పారు. సమావేశంలో సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అమరావతి: మరో రెండు రోజులు వడగాలుల వీచే అవకాశం ఉందని వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రవిబాబు సూచించారు. పరిశుభ్రమైన తాగునీటిని ఎక్కువగా తీసుకోవాలని, ఎండ ఉధృతి ఎక్కువగా ఉండే మధ్యాహ్నం బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. సిల్క్ దుస్తులు కాకుండా కాటన్ దుస్తులను వాడాలని, నలుపు దుస్తులను, ముదురు రంగుల దుస్తులకు వీలైనంత వరకు దూరంగా ఉంచాలని ఆయన సూచించారు.

శరవేగంగా వేబ్రిడ్జి నిర్మాణ పనులు



నిర్మాణ దశలో ఉన్న వేబ్రిడ్జి

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి సమీపాన జాతీయ రహదారి వెంబడి ప్రభుత్వ స్థలం 20 సెంట్లలో రూ. 25లక్షలతో నిర్మిస్తున్న వేబ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్కెటింగ్ అధికారుల సారథ్యంలో పనులు పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఈఈ రవిప్రసాద్ మాట్లాడుతూ రూ. 25 లక్షలతో క్యాబిన్ లోడ్ సెల్స్ తదితర అధునీకరణ యంత్ర పరికరాలు, సీసీ కెమెరాలు అమర్చుతామని తెలిపారు. వేబ్రిడ్జి మార్గంలో వాహనాల రాకపోకలకు అనుకూలంగా రహదారి విస్తరణను పూర్తిస్థాయిలో చేస్తామని చెప్పారు. నెల రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటలు వేబ్రిడ్జి కాటా ద్వారా పారదర్శకంగా తూకం వేసుకొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పంటల్ని తూకం వేసుకునేందుకు వేబ్రిడ్జి రైతులకు అందుబాటులోకి వస్తుందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని చీకటీగలపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త ఉప్పలపాడు, పాత ఉప్పలపాడు, పమిడిపాడు గ్రామాల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ సుధాకర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నాదెండ్లలో..

తూబాడు ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా తూబాడు, సంకురాత్రిపాడు, జంగాల పల్లె, చిరుమామిళ్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలిపి వేస్తున్నట్లు డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

రెండు వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు

శావల్యాపురరం: మండలంలో ఇప్పటి దాకా రైతుల నుంచి రెండు వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేశామని శావల్యాపురం సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ–క్రాప్‌తో పాటు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతు పంటను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని వేల్పూరులో సొసైటీ తరఫున ప్రభుత్వ మద్దతు ధర రూ.5335 చొప్పున 19 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 266 క్వింటాళ్ల శనగలకు సంబంధించిన నగదు వారి బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు చెప్పారు. రైతులంతా కొనుగోలును సద్వినియోగం చేసుకొని, ఆర్థిక ప్రగతి సాధించాలని ఆయన సూచించారు.


సందడిగా సుబ్బగురు యోగీంద్రస్వామి తిరునాళ్ల



పొంగళ్లు చేస్తున్న భక్తులు

బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరులో సుబ్బగురు యోగీంద్రస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దాతలు చిట్టి గోపాలరెడ్డి, కుంటా కోటిరెడ్డి అన్నదానం చేశారు. షిర్డీ సాయి ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో నాలుగు భారీ విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. భక్తుల ఉల్లాసం కోసం నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



సంతగుడిపాడులో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌కుమార్

నాదెండ్ల: గ్రామాల్లో చిన్న చిన్న వివాదాల్ని పెద్ద సమక్షంలో గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్ఐ ఆవుల భాస్కర్ సూచించారు. ఇర్లపాడులో ఆదివారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మంగు రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ చిన్న విషయాలకే ఘర్షణలు పడి వివాదాలను పెద్దవి చేసుకోవద్దని తెలిపారు. మద్యం మత్తులో రభస చేసే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ఎందరో మృత్యువాత పడుతున్నారని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ చేసి రుణాలు ఇస్తామంటూ చెప్పే వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. రాజీపడదగ్గ కేసులను లోక్‌అదాలత్‌లలో డబ్బు, సమయం ఖర్చు లేకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గణపవరం సొసైటీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, మాజీ సర్పంచ్ రంగనాధుల నాగేశ్వరరావు ఉన్నారు.

రొంపిచర్లలో..

గ్రామస్తులంతా వివాదాలకు దూరంగా ఉంటూ కలసిమెలసి జీవించాలని ఎస్ఐ సురేష్‌కుమార్ సూచించారు. శనివారం రాత్రి మండలంలోని సంతగుడిపాడులో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలైన అలవాల, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో పల్లెనిద్ర చేశామని తెలిపారు. పార్టీలకు అతీతంగా వివాదాల జోలికి పోకుండా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బస చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లెకి అంజనారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిరుపేద బ్రాహ్మణులకు చేయూత



బియ్యం, నూతన వస్త్రాలు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాల్ని ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్, లాయర్ గిరిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు. సేవా సమితి తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, చింతలపూడి భద్రయ్య, పుట్టం రాజు బేబీ సరోజిని, నారాయణరావు, భాస్కరరావు, బాబు, విష్ణువేశ్వరి, రామారావు, రవికిరణ్, భువనగిరి సుబ్రహ్మణ్యం, ఎం.వి.శర్మ, నాగేశ్వరరావు, మల్లికార్జునశాస్త్రి పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- అంగలూరులో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: ప్రభుత్వ శాఖలకు సొంత భవనాల్ని ప్రతి పంచాయతీలో నిర్మించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని అంగలూరులో ఆదివారం లక్ష్మి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆయా శాఖల నూతన భవనాల్ని గ్రామాల్లోనే ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వ సేవల్ని అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఏ పని కావాలన్నా మండల కార్యాలయం చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని చెప్పారు. రాబోయే సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేసి తమది ప్రభుత్వం చేతల ప్రభుత్వమని నిరూపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోపెల దేవరాజ్, బుచ్చయ్య, కట్టా వలరాజు, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, దొడ్డా ఏడుకొండలు, బొల్లా రమేష్, బొల్లా బుజ్జి, గడిపూడి వీరనారాయణ, ఏవో రామారావు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని నడిగడ్డలో ఆదివారం శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ముగిసిన కళాసాగరి ఉత్సవాలు



డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో కళాసాగరి ట్రస్ట్ నాట్య ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల్ని ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య పోటీల్లో గుంటూరు, ఒంగోలు, నరసరావుపేట, కందుకూరు, వినుకొండ తదితర ప్రాంతాలకు చెందిన 60 మంది బాలలు పాల్గొన్నారు. గణేష్ రత్తయ్య స్మారక ఆదర్శ రైతు సత్కారాన్ని ఉమ్మడివరం గ్రామానికి చెందిన రైతు వీరగంధం రత్తయ్యకు అందజేశారు. అనంతరం డ్యాన్స్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బొల్లా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూచి రామాంజనేయులు, సదాశివరావు, బ్యాంక్ నాగేశ్వరరావు, ముత్తినేని గిరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, వై.ఆదిరాములు, జయచంద్రపాల్, కోటి, కమలారాం, చలపతిరావు, జ్యోతి, గుండాల స్వెనోమ్, బొల్లా రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988–1993 మధ్య ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సందడిగా సాగింది. ముప్పై ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని సరదాగా గడిపారు. పాఠశాల మొత్తం కలియ తిరిగారు. ఆనాటి తరగతి గదుల్లో గడిపిన మధుర క్షణాల్ని నెమరు వేసుకొన్నారు. ఒక్కరిపై ఒక్కరు జోక్స్ వేసుకుంటూ, ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులతో కేక్ కట్ చేయించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పి ఈ స్థాయికి రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు టి.సాంబయ్య, అబ్బూరి వెంకటేశ్వరరావు, మూర్తి, నరసింహమూర్తి, రామకృష్ణారెడ్డి, శారదా సులోచనలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.